క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు నేడు(మంగళవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈఈ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖాళీ ప్రదేశాల్లోనే పతంగులు ఎగురవేయాలి

భూపాలపల్లి రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలు, పెద్దలు పతంగులు సురక్షిత ఖాళీ ప్రదేశాల్లోనే ఎగురవేయాలని భూపాలపల్లి సర్కిల్ సూపరింటెండింగ్ విద్యుత్ శాఖ ఇంజనీర్ మల్సూర్ నాయక్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పతంగులు ఎగురవేసినట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నాయన్నారు.

కమిటీల ఎన్నిక

మొగుళ్లపల్లి: మండలంలోని కోరికిశాల, పోతుగల్ గ్రామాల్లో బీఆర్ఎస్ నూతన గ్రామ కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. కొరికిశాల గ్రామ అధ్యక్షుడిగా ఇంగ్లీ వీరన్న, ఉపాధ్యక్షులుగా రాజుకుమార్, సురేందర్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కోశాధికారిగా దివాకర్, ప్రచార కార్యదర్శిగా రమేశ్‌ను నియమించారు. అలాగే పోతుగల్లు అధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యక్షుడిగా తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా నరేందర్, కోశాధికారిగా చిరంజీవి, ప్రచార కార్యదర్శిగా కుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, మాజీ జెడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేశ్, మాజీ సర్పంచ్‌లు. నాయకులుపాల్గొన్నారు.

జమా మజీద్ కమిటీ..

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని జమా మజీద్ నూతన కమిటీని సోమవారం మజీద్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మజీద్ పెద్ద మహమ్మద్ ఖాసీం అలీ తెలిపారు. అధ్యక్షుడిగా మొహమ్మద్ హబీబుద్దీన్, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ హఫీజ్, ప్రధాన కార్యదర్శిగా, మొహమ్మద్ అక్మాని, ముఖ్య సలహాదారులుగా మహమ్మద్ ఇర్ఫాని, మహమ్మద్ సాబీర్ ఖాన్, షేక్ జానీమియా, మొహమ్మద్ సాజిద్, మొహమ్మద్ బాబర్ పాషా, కార్యదర్శులుగా అన్వర్ పాషా అక్రమ్ ఖాన్ ఎన్నుకున్నట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మొగుళ్లపల్లి: అనారోగ్య కారణాలతో ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రంగాపురంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రంగాపురం గ్రామానికి చెందిన ఆకుతోట దినేశ్‌తో హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం పంగిడిపల్లికి చెందిన పుల్ల నర్సయ్య కూతురు కల్యాణి (36)తో నెల క్రితం వివాహం జరిగింది. కాగా, కల్యాణికి వివాహం జరిగినప్పటి నుంచి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఆమెకు జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నితో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం మృతురాలి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి..


సాయికుమార్(ఫైల్)

మల్హర్: పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్హర్ మండలంలోని రుద్రారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కొయ్యూరు ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాయికుమార్(23) ట్రాక్టర్ డ్రైవర్‌గా రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సాయికుమార్ మద్యానికి అలవాటు పడ్డాడు. ఇటీవల పని దొరకకపోవడంతో తాగేందుకు డబ్బులు లేక మనో వేదనకు గురై సోమవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం 108 వాహనం ద్వారా భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రేగొండ: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామశివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకుని విచారించినట్లు తెలిపారు. ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతి పత్రాలు లేవని గుర్తించినట్లు పేర్కొన్నారు. రామన్నగూడెంకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సమ్మయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కాటారం: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సోమవారం మండల కేంద్రంలో మండల విద్యాధికారి శ్రీదేవి చేతుల మీదుగా సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, మండల అధ్యక్షుడు రాజేశం, రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మణ్‌నాయక్, సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

ముందుకు సాగని 'ఎత్తిపోతల'

- 2010లో ప్రారంభించిన వల్లెకుంట ఎత్తిపోతల పథకం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు


వల్లెకుంట ఎత్తిపోతల పథకం

మల్హర్: మండలంలోని వల్లెకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని 500 ఎకరాలకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు అందించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2010 సంవత్సరంలో వల్లెకుంట గ్రామంలో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది. ఏళ్లు గడుస్తున్నా ఎత్తిపోతల పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందగా ఉండడంతో ఉత్తిపోతాల పథకంగా మారింది. పనులు ప్రారంభించిన నాటి నుంచి ఒప్పందం ప్రకారం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 20 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. కాని 14 ఏళ్లు గడుస్తున్న పనులు పెండింగ్‌లోనే ఉండటంపై ఎత్తిపోతల పథకం పనులు ఎప్పటికీ పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

రూ.5.92 కోట్లతో నిర్మాణానికి శంకుస్థాపన

వల్లెకుంటలో ఎత్తిపోతల నిర్మాణానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిర్వాహణ సంస్థ ప్రణాళిక రూపొందించింది. రూ.5.92 కోట్ల వ్యయంతో వల్లెకుంట ఎత్తిపోతల పథకాన్ని అప్పటి ఉమ్మడి రాష్ట్ర మంత్రి, ప్రస్తుత తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు 2010 డిసెంబర్ 29న శంకుస్థాపన చేశారు. దీంట్లో భాగంగా కొయ్యూరు మానేరు వాగు నుంచి పది మీటర్ల లోతు నుంచి అంతర్గతంగా పైప్‌లైన్ నిర్మించి వాగు ఒడ్డున 60 హార్స్‌పవర్ గల మూడు విద్యుత్ మోటార్ల ద్వారా నీరు సరఫరా చేయాలి. అలాగే 3,510 మీటర్ల పొడవు పైప్ లైన్ నిర్మాణం చేపట్టి, ఎడ్లపల్లి రహదారి సమీపంలో ప్రధాన ట్యాంకు ఏర్పాటు, అక్కడి నుంచి మళ్లీ కుడి, ఎడమల గుండా పైపు లైన్ నిర్మాణం, మరో నాలుగు చిన్న నీటి ట్యాంకులు నిర్మించాలని అప్పటి అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు.

పనులు సాగింది ఇలా..

2010 సంవత్సరంలో ఇరిగేషన్ శాఖ అధికారులు కాంట్రాక్టర్‌తో చేయించి పనులు ప్రారంభించారు. పని ప్రారంభం నుంచే ఆగుతూ.. సాగుతూ చేపట్టిన పనుల్లో పూర్తి కాకుండా కొంత మేరకు నిలిచిపోయాయి. దీంతో చేసిన పనులకు సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించారు. అతనిని తొలగించి రూ.1.36 కోట్ల నిధులతో మళ్లీ అగ్రిమెంట్ చేసి మరో గుత్తేదారుడితో పనులు మొదలుపెట్టారు. కానీ ఈ పనుల్లో 50 శాతం పనులు మాత్రమే జరిగాయి.

14 ఏళ్లుగా ఎదురుచూపే

తెలంగాణ ఏర్పడ్డాక అప్పటి ప్రభుత్వం 2019లో మిగిలిన పనులకు పూర్తి చేసేందుకు మరో కాంట్రాక్టర్‌తో అధికారులు ఒప్పందం కుదిరించి పనులు ప్రారంభించారు. మానేరు నది నుంచి మూడు కిలోమీటర్ల వరకు బిగించాల్సిన పైపు లైన్ 100 మీటర్ల వరకు జరిగి నిలిచిపోయాయి. కాగా, కొయ్యూరు ఎడ్లపల్లి మార్గం మధ్యలో డెలివరీ స్టేట్నర్ నిర్మాణం పెండింగ్‌లో ఉండిపోయింది. కానీ ఎత్తిపోతల ట్యాంకు వద్ద ఓ షెడ్డు నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసి, మోటార్లు బిగించే సమయంలో వర్షాలు ప్రారంభమయ్యాయి. వరదలు ఉప్పొంగి మానేరు నదిలో కొట్టుకుపోయాయి. అధికారుల నిర్లక్ష్యానికి తోడు కాంట్రాక్టర్ అలసత్వంతో వెచ్చించిన నిధులు నీటిపాలయ్యాయి. దీంతో ఎత్తిపోతల పథకం పనులు మళ్లీ మొదటికి వచ్చింది. దీన్ని ఎవరు పట్టించుకోవడంలేదని 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉండంపై రైతులు మండిపడుతున్నారు. దీనిపై మంథని, మహదేవపూర్ ఇరిగేషన్ ఈఈలు జాయింట్ సర్వే చేసి నివేదిక అందజేయాలని ఉన్నత అధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది. పెండింగ్‌లో ఉన్న పనులు ఇప్పటికైనా పూర్తి చేసి నీరందివ్వాలని గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తియితే కొయ్యూరు, వల్లెకుంట, గట్టుపల్లి గ్రామాల పొలాలకు సాగునీరు అందనుంది.

సాగునీటి కష్టాలు తీరుతాయి



మానేరు నది ఎత్తిపోతల పథకం పూర్తయితే మాకు సాగునీటి కష్టాలు తీరుతాయి. నాకు ఉన్న ఎకరంన్నర పొలంలో బొగ్గుల వాగు ప్రాజెక్టు కాల్వల ద్వారా వచ్చే సాగునీరుతో ఒక పంట పండుతుంది. ఎత్తిపోతల పథకం పూర్తయితే రెండు పంటలు పండించుకుంటాం. పనులు పూర్తి జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎడ్ల రవికుమార్, కొయ్యూరు, మల్హర్

త్వరలోనే పనులు చేపడతాం..

ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులకు మంథని, మల్హర్ అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాల్సి ఉంది. ఇన్‌స్పెక్షన్ చేసిన నోట్ తమ వద్దకు రాగానా పెండింగ్ పనులకు కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేయించి ఎత్తిపోతల పనులనును చేపడుతాం. త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం. వచ్చే వానాకాలం సీజన్‌కు సాగునీరు అందేలా కృషి చేస్తాం.

– ధరావత్ సారయ్య, ఇరిగేషన్ ఏఈ

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- యూనిసెఫ్ బృందం సభ్యులు డాక్టర్ సౌమ్య, ప్రమీల


వివరాలు అడిగి తెలుసుకుంటున్న బృందం సభ్యులు

కాటారం: బాలింతలు, గర్భిణులు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని యూనిసెఫ్ బృందం సభ్యులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ ప్రమీల సూచించారు. కాటారం మండల కేంద్రంతో పాటు బొప్పారం గ్రామాల్లో సోమవారం యూనిసెఫ్ బృందం సభ్యులు పర్యటించారు. ఇంటింటా తిరిగి గర్భిణులు, బాలింతలకు అందుతున్న ప్రభుత్వ వైద్య సేవలపై ఆరా తీశారు. చిన్నారులకు ఇచ్చే టీకాలను గూర్చి ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తల గూర్చి వివరించారు. ఆరోగ్య పరీక్షల నిమిత్తం 102 వాహనాన్ని తప్పనిసరిగా వాడుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు చేయించుకోవాలని తెలిపారు. వైద్యులు నిత్యం వారి పరిధిలోని గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని పర్యావేక్షిస్తూ సేవలందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి, స్థానిక వైద్యాధికారిని డాక్టర్ మౌనిక, డీపీహెచ్ఎన్ ఇంచార్జి షర్మిలమ్మ, హెల్త్ సూపర్వైజర్ సరళ, ఏఎన్ఎంలు సుజాత, నాగరాణి, లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేట్ల పెంపు జీఓను విడుదల చేయాలని ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హమాలీ కూలీలు

భూపాలపల్లి రూరల్: సివిల్ సప్లై హమాలీ కార్మికుల రేట్ల పెంపునకు సంబంధించిన జీఓను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి క్యాతరాజు సతీశ్ మాట్లాడుతూ.. సివిల్ సప్లై హమాలీల కూలీల రేట్లు, ఇతర సమస్యల పరిష్కారానికి గతంలో ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో ఒప్పందానికి రావడం జరిగిందన్నారు. ప్రతీ రెండు సంవత్సరాలకు ఓసారి హమాలీ రేట్లు పెంచి ఇతర సమస్యలు పరిష్కారం చేస్తున్నారన్నారు. కానీ ఈ సంవత్సరమే దాదాపుగా 12 నెలల తర్వాత కూడా పెంచిన హమాలీ రేట్లకు సంబంధించిన జీఓ విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. జీఓను వెంటనే చేసేవరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాములు, సురేశ్ బాలయ్య, హరిబాబు, సాంబయ్య అంజన్న, సమ్మన్న, సంపత్ ,సంతోష్, స్వామి, మహదేవపూర్, చిట్యాల సివిల్ సప్లై హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

'ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నాం'

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి


అంబేడ్కర్ సెంటర్‌లో స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

భూపాలపల్లి రూరల్ : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను పార్టీ అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కటి నెరవేరుస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. సోమవారం పార్టీ అర్బన్ అధ్యక్షుడు దేవన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంబురాల సందర్భంగా బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం జరిగిందని, అదేవిధంగా ధాన్యానికి క్వింటాలకు రూ.500 బోనస్, రైతు భరోసా రూ.12 వేలు, భూమి లేని రైతులకు కూడా రూ.12 వేల ఇస్తామని చెప్పి రైతు కళ్లల్లో ఆనందాన్ని నింపడం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి మండలికి భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చల్లూరి మధు, పార్టీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, శిరుప అనిల్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, పార్టీ నాయకులు కొమురయ్య, రాజేందర్, శ్రీనివాస్, కిషన్,, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి అమలు చేయబోతున్న రైతులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాలకు మద్దతు ఇస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు నిర్వహించుకున్నారు.వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, మండల ప్రధాన కార్యదర్శి కొముర‌య్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సేవారత్న పురస్కారం అందజేత

మొగుళ్లపల్లి: మండలంలోని వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎంగా పనిచేస్తున్న అంబాల రవివర్మ అంబేడ్కర్ సేవారత్న పురస్కారం అందుకున్నారు. ప్రతి ఏటా పలు రంగాల్లో విశేష సేవలందించిన వ్యక్తులకు బహుజన సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో సేవారత్న పురస్కారం అందజేస్తారు. ఈ పురస్కారాన్ని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు నల్ల రాధకృష్ణ, ఎం.గౌతం, కమిటీ సభ్యులు తాటిపల్లి ఈశ్వరయ్య(చీఫ్ జస్టిస్), గౌతమ్, డాక్టర్ బాల యోగి తదితరులు అందజేశారు.

బస్సు సర్వీస్‌ను పునఃప్రారంభించాలని వినతి

టేకుమట్ల: మండల కేంద్రం నుంచి అంకుషాపూర్, మొగుళ్లపల్లి మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పునఃప్రారంభించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్ వినతిపత్రం అందించారు. అలాగే మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ఇతర మండలాలకు వెళ్లాల్సి వస్తుందని, ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు.

'ఇసుక రవాణాపై చర్య తీసుకోవాలి'

కాళేశ్వరం: మంథని నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాపై మంత్రి శ్రీధర్‌బాబు చర్య తీసుకోవాలని బీఆర్ఎస్‌పార్టీ మంథని నియోజకవర్గం మహిళ నాయకులు కేదారి గీత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇసుక రవాణా విషయంలో గతంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుపై కాంగ్రెస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేశారని, ఇప్పుడు మంత్రి ఎందుకు ఇసుక దోపిడీని, ఓవర్‌లోడ్‌ను నివారించడం లేదని ప్రశ్నించారు.

రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థుల ప్రతిభ

భూపాలపల్లి అర్బన్: ఈనెల 5వ తేదీన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో డ్రాంకెన్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు షావాలీన్ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ కరాటే శ్రీనివాస్ (మాదాసి) సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అకాడమీ విద్యార్థులు పాల్గొని విరోనిక స్పారింగ్, అవికటాస్‌లో బంగారు, రజత పతకాలు సాధించినట్లు తెలిపారు.

బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట కార్యవర్గ సభ్యులు కంబాల రాజయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తీగల జగ్గయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఎంఎస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట కార్యవర్గ సభ్యులు సాంబశివరావు, మాజీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్, అర్బన్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, పార్టీ నాయకులు గట్ల శ్రీనివాస్, రవి, వేణు, తదితరులు పాల్గొన్నారు.

భోజనం ఏర్పాటు అభినందనీయం

- ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జిల్లా అధికారి వెంకన్న


మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న వెంకన్న

చిట్యాల: విద్యార్థులకు దాతలు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జిల్లా అధికారి వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల కేంద్రానికి చెందిన రైస్‌మిల్ యాజమాని నిర్మల, వినయ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, ఏబీవీపీ రాష్ట కార్యదర్శి రాజు, పేరెంట్ భిక్షపతి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవితో పాటు లెక్చరర్ల సాయంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నారు. కాగా, సోమవారం ఈ కార్యక్రమాన్ని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జిల్లా అధికారి బి. వెంకన్న ప్రారంభించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

టేకుమట్ల: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రైతు భరోసాలో ఎకరాకు రూ.12వేలను ప్రభుత్వం అందించనుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని ఎంపేడు, రాఘవరెడ్డిపేట, ఆరెపల్లి, వెల్లంపల్లి, వెలిశాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా సంబురాల్లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రాష్ట ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేసిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదిముభాక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీ శ్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, రవీందర్, శ్రీనివాస్, సంపత్, వీరేశం, స్వామిరావు, రామారావు, కిరణ్, మాదం కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని దమ్మన్నపేట నుంచి నాగారం రోడ్డు మరమ్మతు పనుల కోసం రూ.50 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు, జిల్లా, మండల నాయకులు నాయిని సంపత్‌రావు, పున్నం రవి, ఐలి శ్రీధర్, వీరబ్రహ్మం , పత్తి ప్రభాకర్, ప్రతాప్‌రెడ్డి, వినోద్‌కుమార్, బొట్ల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

- డాక్టర్ ఆశాజ్యోతి

టేకుమట్ల: విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆశాజ్యోతి అన్నారు. సోమవారం మండలంలోని వెలిశాల ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియా(కొడవలి కణ రక్త హీనత) పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం పరిశుభ్రంగా ఉండాలని, ఏవైనా వస్తువులను తాకినప్పుడు వెంటనే చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతీ రోజు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. నీటిని అధికంగా సూచించారు. ప్రస్తుతం చైనా వైరస్ వ్యాప్తి దృష్ట్యా గతంలో కరోనా సమయంలో తీసుకున్న జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ ఉపాధ్యాయ బృందం మియాపురం జగన్నాథం, హెల్త్ సూపర్‌వైజర్ విజయ, ఏఎన్ఎంలు సంగీత, లావణ్య, ఆశ వర్కర్లు స్వప్న, కోమల, సరిత, తదితరులు పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం నీరు అందించాలి

పలిమెల: మండలంలోని గ్రామాల రైతుల పంట పొలాలకు చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు అందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. మండలంలో కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు అధికంగా జీవనం సాగిస్తున్నారని, వారి పంట చేనులకు ఎటువంటి నీటి సౌకర్యం లేక పంటల దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోని ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు అందించాలన్నారు. లేకుంటే మండలంలోని పెద్ద వాగులపై ఒక టీఎంసీ నీరు నిలువ ఉండే విధంగా రిజర్వాయర్‌ను ఏర్పాటు చేసి మండలంలోని పంట పొలాలకు నీరు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మడే సత్యనారాయణ, అలం సత్యనారాయణ, కిష్టస్వామి, రాకేష్, కామేష్, వినోద్, భిక్షమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

భూపాలపల్లి అర్బన్: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 28వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు గాంధీటోపీలు ధరించి శాంతియుత నిరసన తెలిపారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పే స్కేల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీరి దీక్షలకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీమనాధుని సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. చాంద్‌పాషా, వేణు, చంద్రకళ, కనకలక్ష్మి, మహేందర్, నరేష్, రాజు, తిరుపతి, సుదర్శన్, సతీష్ పాల్గొన్నారు.

వర్గీకరణ వ్యతిరేకుల దుమ్ము దులుపుతాం..

- ఎమ్మార్పీఎస్ రాష్ట నాయకుడు కుమార్


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాళేశ్వరం: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకుల దుమ్ముదులుపుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట నాయకుడు మంద కుమార్ మాదిగ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. మహదేవపూర్ మండల కేంద్రంలో నేడు (మంగళవారం) నిర్వహించే కళాకారుల రథయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట ప్రభుత్వం వర్గీకరణను చేయకుండా జాప్యం చేస్తున్నారని, ఇప్పటికైనా కమిషన్ వేసి కాలయాపన చేయకుండా వర్గీకరణ తక్షణమే చేయాలని డిమాండ్ చేశారు. మహదేవపూర్‌లో జరిగే కళాకారుల రథయాత్రకు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంబాల చంద్రమౌళి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు జిల్లెల్ల నాగరాజు, సీనియర్ నాయకులు నల్లబుగా ధర్మయ్య, లింగాల సమ్మయ్య, తుడిచర్ల దుర్గయ్య, ఆత్కూరు సారయ్య, కొలుగూరి రాజయ్య, మాదిగ యువసేన మండల అధ్యక్షుడు మంథని రవితేజ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం


రేగొండ: ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు రైతులకు రైతు భరోసా పెంచాలని ధర్నా చేపట్టారు. రేగొండ, కొత్తపల్లిగోరి మండల కేంద్రాల్లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి వరంగల్ వేదికగా రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకి రైతు భరోసా రూ.15 వేలు అందించాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మొగుళ్లపల్లి : ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


చిట్యాలలో..

పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై దాడులు

రేగొండ : నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిల్వచేసిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్న ఘటన మండలంలోని భాగిర్థిపేటలో చోటు చేసుకుంది. గ్రామంలోని దుర్గాభవాని రైస్ మిల్‌లో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారం మేరకు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 453 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించిన అనంతరం లింగాలలోని లక్ష్మీ ట్రేడర్స్‌కు తరలించారు. అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసిన మిల్లు యాజమాని గడ్డం వెంకటస్వామి, డ్రైవర్లు కుసుంబ శ్రీనివాస్, రత్నాకర్, ఆంజనేయులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. దాడుల్లో సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై ఏసీఎస్‌టీ వేణు, డిప్యూటీ తహసీల్దార్ రజాక్, ఆర్ఐ నరేష్ కుమార్, సివిల్ పోలీసులు. తదితరులు పాల్గొన్నారు.